www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

### విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి



3 లో..

### గోదావరి పుష్కర పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్ అంకిత్




4 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 248, గురువారం 8-10-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam




# సోలార్ మోడల్ గ్రామంగా అభివృద్ధి

- పీచుపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం: మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రజా పాలనలో గ్రామ పర్యటన.. వినతులు స్వీకరించి సమస్యలపై ఆరా
- మౌలిక వసతుల కల్పనకు హామీ

**పీచుపల్లి, అక్టోబర్ 7**

'పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా పీచుపల్లి గ్రామాన్ని సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై స్థానికులతో చర్చించి వినతిపత్రాలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజా పాలన ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వం చేరువవుతోందని పేర్కొన్నారు. పీచుపల్లిని సోలార్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. ప్రతి ఇంటి ముందు సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని విద్యుత్ ఆదాతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగు,

మిగతా 2 లో..

# మోదీ ప్రజాసేవకు నివాళి

- సేవా జ్యోతి కలశ యాత్రలో పాల్గొన్న ఎంపీ
- అల్వాల్‌లో ఘనంగా సేవా సంకల్ప కార్యక్రమం
- - వికసిత భారత్ లక్ష్యాలపై పిలుపు

**హైదరాబాద్, అక్టోబర్ 7 :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అల్వాల్‌లో నిర్వహించిన వికసిత భారత్ సేవా జ్యోతి కలశ యాత్రలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు డి. గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శోభా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించిన అనంతరం సేవా జ్యోతి కలశ యాత్రను ప్రారంభించారు. శోభా గార్డెన్స్ నుంచి

మిగతా 2 లో..





# ఉపాధి హామీ పనులకు భారీ స్పందన

- ఒక్కరోజే 2.54 లక్షల మంది కూలీల హాజరు
- గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భరోసా
- ఉపాధి అవకాశాల విస్తరణకు చర్యలు
- సమీక్షలు నిర్వహిస్తున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, అక్టోబర్ 7 :**

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. వ్యవసాయ పనులు తగ్గుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడంతో కూలీల హాజరు గణనీయంగా పెరిగింది. అక్టోబర్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పనులపై గ్రామీణ ప్రజలు పెద్దఎత్తున ఆసక్తి చూపుతున్నారు. మంగళవారం ఒక్కరోజే 2,54,812 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. వీబీ-జీ రామ్ జీ అమలు ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలో నమోదైన అత్యధిక రోజువారీ కూలీల హాజరు ఇదేనని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల ఈ స్థాయిలో స్పందన లభించినట్లు అధికారులు తెలిపారు.

మిగతా 2 లో..



# గ్రామాభివృద్ధికి కట్టుబాటు

- ప్రజల సమస్యలు తెలుసుకున్న పొన్నం
- మహిళా సంఘాలకు రుణాల పంపిణీ
- అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

**రామంచ, అక్టోబర్ 7 :**

"పల్లె పల్లెకు పొన్నమన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రామంచ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని

మిగతా 2 లో..



# హరీశ్‌రావుకు జూపల్లి కౌంటర్

- వాస్తవాలు తెలుసుకుని విమర్శించాలి
- మద్యం అమ్మకాలపై గణాంకాలతో వివరణ
- బీఆర్ఎస్ పాలనపై విమర్శలు



**హైదరాబాద్, అక్టోబర్ 7**

బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఘాటుగా స్పందించారు. ఒక పత్రికలో పొరపాటుగా ప్రచురితమైన అంశాన్ని ఆధారంగా చేసుకుని

మిగతా 2 లో..



# డీ.ఈ.షా ఇండియా 30వ వార్షికోత్సవం

- హైదరాబాద్‌లో కొత్త కార్యాలయ ప్రకటన
- వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు
- పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తామన్న మంత్రి
- సంస్థకు శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వం

**హైదరాబాద్, అక్టోబర్ 7 :**

డీ.ఈ. షా ఇండియా సంస్థ 30వ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని సంస్థ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. వేడుకల్లో మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు, ప్రపంచ స్థాయి సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు, తమ కార్యకలాపాలను విస్తరించేందుకు రాష్ట్రప్రభుత్వం అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. పరిశ్రమలు, సేవారంగ సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని పేర్కొన్నారు.

మిగతా 2 లో..

భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Follow : @bhadradrinews
గురువారం
8 | అక్టోబర్ | 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# ఉపాధి హామీ పనులకు భారీ స్పందన

(మొదటి పేజీ తరువాయి)

గత ఐదేళ్ల అక్టోబర్ నెల గణాంకాలను పరిశీలిస్తే ఈ పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. 2025 అక్టోబర్‌లో రోజుకు సగటున 24,750 మంది మాత్రమే పనులకు హాజరవగా, 2026 అక్టోబర్‌లో ఈ సంఖ్య 2.16 లక్షలకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే రోజువారీ సగటు కూలీల హాజరు అనేక రెట్లు పెరగడం గమనార్హమని అధికారులు పేర్కొన్నారు. వ్యవసాయ పనులు తగ్గుతున్న పరిస్థితుల్లో గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించేందుకు ఉపాధి హామీ పనులను మరింత విస్తరించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పని కోరుతున్న ప్రతి కుటుంబానికి త్వరితగతిన ఉపాధి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

గ్రామాల్లో పని కోరుతున్న కూలీలను గుర్తించి అందుబాటులో ఉన్న పనుల వివరాలను తెలియజేయాలని మంత్రి సూచించారు. వేజ్ సీకర్ల సంఖ్యను మరింత పెంచేందుకు క్షేత్ర స్థాయిలో అధికారులు చురుకుగా పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు నిరంతరంగా అందేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కొత్తగా ఉపాధి హామీ కార్డులు కోరుతున్న వారికి 15 రోజుల్లోపు కార్డులు జారీ చేయాలని మంత్రి సీతక్క అధికారులకు స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కుటుంబాల జీవనోపాధిని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి, పేద కుటుంబాల ఆర్థిక స్థిరత్వం కోసం ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

# మోదీ ప్రజాసేవకు నివాళి

(మొదటి పేజీ తరువాయి)

శివాజీ చౌక్, కానజిగూడ పెట్రోల్ బంక్ వరకు యాత్ర కొనసాగింది. యాత్రలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మోదీ అందిస్తున్న నాయకత్వం స్ఫూర్తిదాయకమని అన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా మోదీ 25 ఏళ్ల ప్రస్థానం దేశ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాల ద్వారా సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ సేవా జ్యోతి కలశ యాత్ర స్థానికంగా విశేష స్పందన పొందింది. దేశాభివృద్ధి, సేవా భావం, ప్రజల భాగస్వామ్యంతో వికసిత భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు.

# సోలార్ మోడల్ గ్రామంగా అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

పాడి పరిశ్రమ, పశుపోషణ వంటి అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలని మంత్రి కోరారు. వ్యవసాయ ఆదాయాన్ని పెంచుకునేందుకు విభిన్న మార్గాలను అన్వేషించాలని సూచించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రైతుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు, ప్రతి పొలంలో పంటకుంటలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. నీటి సంరక్షణ ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో గ్రామస్థుల భాగస్వామ్యం అవసరమన్నారు. గ్రామంలోని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, సౌర వీధి దీపాలు, వ్యవసాయ రహదారులు తదితర మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పీచుపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# గ్రామాభివృద్ధికి కట్టుబాటు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. గ్రామ పర్యటన సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు రూ.40 లక్షల బ్యాంకు అనుసంధాన రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రామంచ గ్రామ అభివృద్ధికి రూ.5.24 కోట్ల విలువైన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రామంచ-ములకనూరు రహదారి అభివృద్ధికి రూ.3.60 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే మూడు చెరువుల మత్తడి నీరు దాటే ప్రాంతాల్లో కల్వర్టులు, రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే రాకపోకలు సులభతరం కావడంతో పాటు గ్రామ ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని వివరించారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం, తాగునీటి సరఫరా, రహదారులు, మురుగు నీటి పారుదల వంటి రంగాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రామంచలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# డీ.ఈ.షా ఇండియా 30వ వార్షికోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

డీ.ఈ. షా ఇండియా మూడు దశాబ్దాలుగా సాధించిన విజయాలను మంత్రి అభినందించారు. సాంకేతికత, ఆర్థిక సేవలు, పరిశోధన రంగాల్లో సంస్థ విశిష్టమైన సేవలు అందిస్తోందని అన్నారు. హైదరాబాద్‌ను తమ అభివృద్ధి కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. కొత్త కార్యాలయం ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థల విస్తరణతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పాటు లభిస్తుందని చెప్పారు. యువతకు నైపుణ్యాధారిత ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఇటువంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

హైదరాబాద్ ఇప్పటికే సాంకేతిక, ఆవిష్కరణల కేంద్రంగా గుర్తింపు పొందిందని శ్రీధర్ బాబు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలు నగరాన్ని తమ కార్యకలాపాల కేంద్రంగా ఎంచుకుంటున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాలు, ప్రతిభవంతులైన మానవ వనరులు హైదరాబాద్ ప్రత్యేకతగా నిలుస్తున్నాయని వివరించారు. డీ.ఈ. షా ఇండియా బృందానికి మంత్రి మరోసారి అభినందనలు తెలియజేశారు. సంస్థ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ఇలాంటి సంస్థల భాగస్వామ్యం మరింత బలపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆర్మ్ రెజ్లింగ్‌లో రాధికకు కాంస్య పతకం

- **డీజీపీ అభినందనలు**
- **తెలంగాణ పోలీసులకు గర్వకారణం**
- **జాతీయ స్థాయిలో ప్రతిభకు గుర్తింపు**

**హైదరాబాద్, అక్టోబర్ 7**

: 75వ అఖిల భారత పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ క్రీడా పోటీలలో మహిళల 90 కిలోల కుపైబడిన విభాగం ఆర్మ్ రెజ్లింగ్ పోటీలో తెలంగాణ పోలీసు శాఖకు చెందిన మహిళా పోలీసు కానిస్టేబుల్ జి. రాధిక కాంస్య పతకం సాధించారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక పోటీలలో రాధిక చూపిన ప్రతిభ రాష్ట్ర పోలీసు శాఖకు గౌరవాన్ని తీసుకువచ్చింది. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఆమె సాధించిన విజయం ఇతర సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తోందని అధికారులు పేర్కొన్నారు. కఠోర సాధన, పట్టుదల, అంకితభావంతో ఈ ఘనతను అందుకున్న రాధికను సహచరులు అభినందించారు. ఈ విజయంపై తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ప్రత్యేకంగా స్పందించి రాధికకు అభినందనలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేస్తూనే క్రీడా రంగంలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు సిబ్బంది




లో ఎన్నో ప్రతిభావంతులు ఉన్నారని, వారికి తగిన అవకాశాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించే సామర్థ్యం ఉందని అన్నారు. రాధిక విజయం తెలంగాణ పోలీసు శాఖలోని క్రీడా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.

తెలంగాణ పోలీస్ క్రీడల వార్షిక ప్రణాళికను అఖిల భారత పోలీస్ క్రీడల ప్రణాళికతో అనుసంధానం చేయడం వల్ల సిబ్బందికి విస్తృత అవకాశాలు లభిస్తున్నాయని డీజీపీ తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు మరింత మంది సిబ్బంది వివిధ క్రీడల్లో పాల్గొనే అవకాశం పొందుతున్నారని చెప్పారు. క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతోందని పేర్కొన్నారు. ఇది ఉద్యోగ నిర్వహణలో కూడా సానుకూల ఫలితాలు ఇస్తోందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన క్లస్టర్ విధానం వల్ల వివిధ క్రీడాంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా క్రీడాకారులు ముందుగానే తమ పోటీల గురించి తెలుసుకుని సమగ్రంగా సాధన చేసుకునే అవకాశం పొందుతున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన సమయాన్ని కేటాయించుకోవడంతో పాటు శిక్షణను మెరుగుపరుచుకునే అవకాశాలు కూడా పెరిగాయని పేర్కొన్నారు. దీని ఫలితంగానే తెలంగాణ పోలీసు సిబ్బంది జాతీయ వేదికలపై మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు.

రాధిక సాధించిన కాంస్య పతకం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా మొత్తం తెలంగాణ పోలీసు శాఖకు గర్వకారణమని క్రీడా విభాగం అధికారులు తెలిపారు. మహిళా సిబ్బంది కూడా అన్ని రంగాల్లో సమానంగా రాణించగలరనే విషయాన్ని ఆమె నిరూపించారని అన్నారు. క్రీడా రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు శాఖ తీసుకుంటున్న చర్యలకు ఈ విజయం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అభిప్రాయపడ్డారు. యువ సిబ్బందికి రాధిక ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని తెలంగాణకు మరిన్ని పతకాలు సాధించాలని డీజీపీ ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న సిబ్బందికి శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధన ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమని రాధిక విజయం మరోసారి నిరూపించిందని తెలిపారు. ఆమెకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు చేకూరాలని పోలీసు శాఖ అధికారులు, సహచరులు శుభాకాంక్షలు తెలిపారు.

# హరీశ్‌రావుకు జూపల్లి కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

హరీశ్‌రావు తొందరపాటుతో విమర్శలు చేశారని పేర్కొన్నారు. తాను ఎక్కడా శ్రీశైలం నీటిని బీర్ల తయారీకి వినియోగిస్తామని చెప్పలేదని స్పష్టం చేశారు. డిండి ప్రాజెక్టుకు శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి నీటిని మళ్లిస్తే తెలంగాణకు ప్రయోజనం ఉంటుందని మాత్రమే చెప్పానని వివరించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ విమర్శలు చేయడం సరికాదని జూపల్లి అన్నారు. ఎల్‌నినో ప్రభావం, మద్యం అమ్మకాలు వంటి వేర్వేరు అంశాలను ముడిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వాస్తవాలను తెలుసుకోకుండా విమర్శలు చేయడం బాధ్యతాయుత రాజకీయాలకు తగదని పేర్కొన్నారు.

మద్యం అమ్మకాల అంశంపై బీఆర్ఎస్ ప్రభుత్వానిదే ప్రధాన బాధ్యత అని మంత్రి ఆరోపించారు. అధికారిక గణాంకాల ప్రకారం 201415లో తెలంగాణలో మద్యం అమ్మకాల విలువ రూ.8,846 కోట్లు ఉండగా, 202223 నాటికి అది రూ.35,145 కోట్లకు చేరిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో మద్యం అమ్మకాలు రూ.26,299 కోట్లు పెరిగి దాదాపు 297 శాతం వృద్ధి చెందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి భిన్నంగా ఉందని జూపల్లి వివరించారు. 202324లో రూ.36,493 కోట్లుగా ఉన్న మద్యం అమ్మకాల విలువ 202526 నాటికి రూ.40,209 కోట్లకు చేరిందని తెలిపారు. ఈ పెరుగుదల కేవలం 10 శాతం మాత్రమేనని పేర్కొంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. మద్యం విక్రయాల ద్వారా రాష్ట్ర ఖజానాను నింపింది ఎవరో ప్రజలకు తెలుసని మంత్రి వ్యాఖ్యానించారు. పదేళ్ల పాలనలో మద్యం విక్రయాలను భారీగా పెంచిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆశ్చర్యకరమని అన్నారు. గణాంకాలు, అధికారిక లెక్కలు తమ వాదనకు బలంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం కంటే ప్రజలకు నిజాలు చెప్పడం అవసరమని జూపల్లి కృష్ణారావు సూచించారు. తాను గణాంకాలతో మాట్లాడుతున్నానని, ఈ అంశంపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు.

# నీటి వృథాపై కఠిన చర్యలు

- **హోటల్‌కు రూ.20 వేల జరిమానా**
- **జూబ్లీహిల్స్‌లో జలమండలి తనిఖీలు**
- **నీటి సంరక్షణకు ఎండీ పిలుపు**

**హైదరాబాద్, అక్టోబర్ 7**

విలువైన నీటి వనరులను అనవసర అవసరాలకు వినియోగిస్తూ వృథా చేసిన ఘటనపై జలమండలి అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లోని ఓ హోటల్ ప్రాంగణంలో నీటిని అధికంగా వినియోగించి శుభ్రపరిచినట్లు గుర్తించి రూ.20 వేల జరిమానా విధించి వసూలు చేశారు. నీటి వనరుల సంరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని జలమండలి స్పష్టం చేసింది. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్రాంతంలో పర్యటిస్తుండగా రోడ్ నంబర్ 45లోని ప్లాట్ నంబర్ 775 జీలో ఉన్న 'అనగనగా' హోటల్ ప్రాంగణాన్ని నీటితో శుభ్రం చేస్తూ వృథా చేస్తున్న దృశ్యాన్ని గమనించారు. తాగునీటి కొరత పరిస్థితులు ఉన్న సమయంలో ఇలాంటి చర్యలు ఆందోళనకరమని ఆయన అభిప్రాయపడ్డారు. వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నీరు అత్యంత విలువైన సహజ వనరని, దానిని బాధ్యతారహితంగా వినియోగించడం సమాజానికి నష్టం కలిగిస్తుందని అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాంగణాలు, రహదారులు లేదా ఇతర ప్రాంతాలను శుభ్రం చేయడానికి తాగునీటిని లేదా సరఫరా నీటిని అధికంగా వినియోగించడం తగదన్నారు. నీటి వనరుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఎండీ ఆదేశాల మేరకు జలమండలి అధికారులు సంబంధిత నిర్వాహకురాలు కె. గాయత్రి రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అనంతరం నిబంధనల ప్రకారం రూ.20 వేల జరిమానా విధించి ఆ మొత్తాన్ని వసూలు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

నగరంలో నీటి వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తాగునీటి వృథాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. నీటిని అనవసరంగా వినియోగిస్తున్నట్లు గుర్తించిన వ్యక్తులు, సంస్థలపై జరిమానాలతో పాటు ఇతర చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు, పెరుగుతున్న జనాభా అవసరాల నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును ఆదా చేయాల్సిన అవసరం ఉందని జలమండలి పేర్కొంది. నీటి వనరులను పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు భద్రమైన నీటి నిల్వలను అందించవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా నీటి పొదుపు చర్యలు చేపట్టి నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని జలమండలి పిలుపునిచ్చింది.

# పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

- **మైనర్ సమ్మతి చట్టబద్ధం కాదన్న ఎస్పీ**
- **లైంగిక దాడి కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు**
- **రూ.20 వేల జరిమానా కూడా విధింపు**

**మెదక్, అక్టోబర్ 7**

: ప్రేమ పేరుతో ఓ మైనర్ బాలికను నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు కఠిన శిక్ష విధించింది. శంకరంపేట ఆర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో బాధితురాలు 16 ఏళ్ల బాలిక కావడంతో పోక్సో చట్టం కింద విచారణ జరిగింది. బాలికను ప్రేమ పేరుతో మోసగించి లైంగిక దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలడంతో పోలీసులు పకడ్బందీగా కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు సాక్ష్యాధారాలు సమర్పించారు. విచారణ అనంతరం నిందితుడిపై ఆరోపణలు రుజువైనట్లు కోర్టు నిర్ధారించింది. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ మైనర్ బాలిక అంగీకారం చట్టబద్ధమైన సమ్మతిగా పరిగణించబడదని స్పష్టం చేశారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలబాలికల విషయంలో పోక్సో చట్టం అత్యంత కఠినంగా అమలవుతుందని తెలిపారు. బాలల హక్కులు, భద్రత విషయంలో రాజీకి తావులేదన్నారు. పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఇటువంటి కేసుల్లో బాధిత కుటుంబాలు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించి చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. బాలల రక్షణ కోసం తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. పిల్లలకు మంచి, చెడు స్పర్శల గురించి అవగాహన కల్పించడంతో పాటు అనుమానాస్పద పరిస్థితులను వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. పాఠశాలలు, విద్యాసంస్థలు కూడా బాలల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, సమర్థవంతమైన న్యాయపోరాటం ద్వారా బాధితులకు న్యాయం అందించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని ఎస్పీ తెలిపారు. ఈ తీర్పు బాలలపై నేరాలకు పాల్పడే వారికి హెచ్చరికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# వైరాలో వనమా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో సేవా కార్యక్రమం

**- 150 మంది విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల సామాగ్రి వనమా ట్రస్ట్ ద్వారా అందజేత**



**వైరా, అక్టోబర్ 7,( భద్రాద్రి న్యూస్ )** : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాల బాలికలకు 150 మంది విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలకు ఆర్థికంగా వెనుకబడి ఉంటారని డిక్షనరీలు, కం బాక్స్ లు, పెన్నులు, రాత సామాగ్రిని వనమా ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ప్రధాన కార్యదర్శి పెనుగొండ ఉపేందర్ రావు ఆధ్వర్యంలో ఈ సామాగ్రిని వనమా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు అందజేశారు ఈ సందర్భంగా వనమా ట్రస్ట్ చైర్మన్ వనమా వేణుగోపాలరావు( సూరి), చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వర్మ విశ్వేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతిభ ఉండి చదువుకోటానికి స్తోమత లేక, పిల్లల తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లి పిల్లలను చదివించుకునే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరుగుతుందని, అలాంటి పిల్లలకు చదువుల్లో చురుకుగా ముందుకు వెళ్ళటం కోసం వనమా ట్రస్ట్ ద్వారా చేతనైన సహాయము ఎల్లవేళలా అందిస్తామని వారికి సూచించారు. వారు అన్ని విధాలుగా ఆర్థికంగా వెనుకబడి ఉంటారు కావున అలాంటి వారికి సహాయం చేస్తే భవిష్యత్తులో మంచి పొజిషన్లో ఉంటారని అన్నారు పేదలకు సహాయం చేయడంలో వనమా ట్రస్టు ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదివి ఉన్నత చదువులు చదవాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడినారు. ఈ కార్యక్రమంలో వనమా కిరణ్ కుమార్, కార్తీక్, వైరా మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్, రాష్ట్ర బాధ్యులు నూకల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహాసభ నియోజకవర్గ ఇన్చార్జ్ మిట్టపల్లి సత్యంబాబు, వదినేపల్లి చక్రవర్తి, కొణతాలపల్లి సుజిత్ సుజిత్, మాలే ఉదయ్ తేజ్, మధిర ఆర్యవైశ్య సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనమా వెంకట సీతారామారావు, రమాదేవి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కృష్ణమూర్తి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# ఐఎంఏ అధ్యక్షుడిని కలిసిన ఎం.పి.జే జిల్లా కమిటీ బృందం



**ఖమ్మం మన వెలుగు ప్రతినిధి:** మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎం.పి.జే) ఖమ్మం జిల్లా బృందం సభ్యులు ఈరోజు ఖమ్మంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి హరిప్రసాద్ ను మర్యాద పూర్వకంగా ప్రసూన ఆర్థోపెడిక్ హాస్పిటల్ లో కలిశారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. సమాజంలో శాంతి, న్యాయం, సామాజిక బాధ్యతలకు సంబంధించిన పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజా సంక్షేమం కోసం వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహించడంపై వారు అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిజె జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. ఖాసిం, జనరల్ సెక్రటరీ ఎస్.డి. నాసర్ అహ్మద్, ట్రెజరర్ ఎం.డి. హకీమ్, కార్యదర్శులు ఎం.డి. రాజబాలి, ఎస్.డి. రఫీక్, సభ్యులు ఎస్.కె. షరీఫ్, ఎం.డి. బియాబాని తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ సంకల్ప సేవా జ్యోతి యాత్ర

**- 2047లో వికసిత్ భారత్ లక్ష్యమే ఈ సంకల్ప సభ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**
**- ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎస్ సైదిరెడ్డి.**



**కొత్తగూడెం అర్బన్ ,అక్టోబర్ 7 (భద్రాద్రిన్యూస్):**
వికసిద్భారత్ సంకల్ప సేవ జ్యోతి యాత్ర కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ-సేవా జ్యోతి యాత్రను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎస్. సైదిరెడ్డి, జిల్లా సంస్థ గత ఇంచార్జ్ డాక్టర్ విజయ చంద్రారెడ్డి పాల్గొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో అడుగుపెట్టి ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రిగా ఈ దేశానికి సేవలందించడం 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ లో ఏర్పాటుచేసిన డిజిటల్ స్క్రీన్ లో వికసిత్ భారత్ సంకల్ప సభలో జాతీయ బిజెపి అధ్యక్షులు నితిన్ నబిన్, భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని జిల్లా వ్యాప్తంగా వచ్చిన భారతీయ జనతా పార్టీ నాయకులు, పట్టణంలో ప్రముఖులు, వివిధ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు విన్నారు. ఈ ప్రసంగంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలను ఉద్దేశించి 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రతి పౌరుడు సంకల్ప దీక్షను తీసుకోవాలని అన్నారు. మా ప్రభుత్వ విధానం కుల మత రాజకీయాలు చేయడం కాదని దేశంలోని ప్రతి పౌరుడికి ఈ దేశ ఫలాలు అందాలన్నదే తమ ప్రభుత్వ విధానం అని అన్నారు. అదేవిధంగా 2047 వికసిత్ భారత్ వి విల్ డూ ఇట్, మేకిన్ ఇండియా వి విల్ డూ ఇట్. ఆత్మ నిర్భర్భారత్ వి విల్ డూ ఇట్. ఒలంపిక్ డ్రీమ్ వి విల్ డూ ఇట్. అంటూ ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అందరూ 2047, వికసిత్ భారత్ లక్ష్యంగా దీక్ష చేపట్టాలని అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరం పనిచేయాలని అన్నారు. తరువాత కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి సేవా జ్యోతి యాత్రను జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీదేవి పల్లి వరకు కొనసాగించారు. ఈ యాత్రలో బిజెపి ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు జీవీకే మనోహర్ , కె.వి రంగా కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోడియం బాలరాజు, ఇతర రాష్ట్ర జిల్లా నాయకులు కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గర్భిణీలకు బలవర్ధకమైన ఆహారం అందించాలి



**ఖమ్మం ప్రతినిధి ,అక్టోబర్ 7( భద్రాద్రిన్యూస్ ):-**
ఖమ్మం రూరల్ ప్రాజెక్టులోనే ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో నాయుడు పేట 3వ వార్డు అంగన్వాడి కేంద్రం 1,2, 3లలో పోషణ మహా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ సత్యవతి సిడిపిఓ కమల ప్రియ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలకు బాలింతలకు చిన్న పిల్లలకు ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు గుడ్లు మరియు పప్పు దినుసులు , ఆకుకూరలు,పాలు, పాల పదార్థాలు,
గర్భిణీలకు బాలింతలకు 6 సంవత్సరాల లోపు పి ల్లలకి ప్రతి రోజు ఆహారంలోగుడ్డు పాలు పప్పులు కూరగాయలు ఆకుకూరలు చిరుదాన్యాలుపెట్టాలని తెలియపరచడం జరిగింది కూరగాయలు, ఆకుకూరలు కడిగిన తరవాతనే కోసి వండుకోవాలని అన్నం వండేటప్పుడు గంజి వార్చ కూడదు అని తెల్ల బియ్యం . పంచదార ఉప్పు, మొదలగునవి తక్కువగా వాడాలని 1000 రోజుల ప్రాముఖ్యత మరియు అంగన్వాడి కేంద్రంలో ఇచ్చే బాలామృతంలో పోషక పదార్థాలు ఉంటది కాబట్టి 7-3 సంవత్సరాలపిల్లలకి బాలామృతం తినిపించాలని తెలియపరచినారు గర్భిణీలు బాలింతలు ఆరు సంవత్సరాలపిల్లలకి ప్రతిరోజు రకరకాల ఆహార పదార్థాలు పెడుతూ వారి వయస్సుకు తగ్గట్టు ఎత్తు బరువు పెరిగేటట్టు చూసుకోగలరు పిల్లలకు పోన్లు ఇవ్వడం వలన పిల్లల యొక్క నరాలు వీక్ అవుతాయి. ఇతర పిల్లలతో కలసి ఆడుకోడానికి ఆసక్తి చూపరు కాబట్టి పిల్లలకి పోన్లు ఇవ్వవద్దు అని తెలియపరచారు జంక్ పుడ్సు పిల్లలకు పెట్టవద్దని
అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్య లక్ష్మీ భోజనం ప్రతి ఒక్క గర్భిణీ బాలింత తీసుకోవాలని తెలియపరిచినారు పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించనైననది ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మాలతి కుమారి , మానవ హక్కుల జిల్లా అధ్యక్షురాలు తోటకూరి అంజమ్మ అంగన్వాడీ టీచర్లు విజయ లక్ష్మి, .సరోజిని, సరితా బాయి . ఆయా శైలజ ఆశా కార్యకర్తలు , సుజాత పుల్లమ్మ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుదా రాణి ఆర్.పి వెంకటలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**
**- పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి**
**- విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలి**





**ములకలపల్లి,అక్టోబర్ 7( భద్రాద్రిన్యూస్ ):**
ములకలపల్లి మండలం మూకమామిడి ఏకలవ్య పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించిన కలెక్టర్, ప పాఠశాలలోని ప్రతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులు రాస్తున్న పరీక్షలను గమనించి, వారి ప్రశ్నపత్రాలు, ఆన్సర్ షీట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో పాటిస్తున్న విధానం, విద్యార్థుల హాజరు, పరీక్షల సమయంలో తీసుకుంటున్న చర్యలను పరిశీలించి, ప్రధానోపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని ఏకలవ్య పాఠశాలలకు ఒకే ప్రశ్నపత్రాన్ని రూపొందించి పంపిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పాఠశాలలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. మెడికల్ రూమ్‌లో అందుబాటులో ఉన్న మందులు, విద్యార్థులకు అందించిన చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన మందులు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల కిచెన్ షెడ్‌ను పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. వంటకు వినియోగిస్తున్న కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కూరగాయలను నేలపై ఉంచడాన్ని గమనించిన కలెక్టర్, కూరగాయలను నేలపై ఉంచడం వల్ల పురుగులు, క్రిమికీటకాలు చేరి ఆహారం కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. కూరగాయలను ర్యాకులు, బండలపై సురక్షితంగా నిల్వ చేయాలని ఆదేశించారు. కిచెన్ నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కలెక్టర్, ఆహార పదార్థాల తయారీలో తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని సూచించారు. వంటకు వినియోగించే కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను శుభ్రంగా కడిగి, నాణ్యతను పరిశీలించిన అనంతరం మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, తాజా కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వంటశాలను ప్రతిరోజూ శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా చూడాలని సూచించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని క్రమబద్ధంగా నిల్వ చేయాలని ఆదేశించారు. ధాన్యాలు, పప్పులు, కూరగాయలు తదితర వస్తువులను నేలపై ఉంచకుండా ర్యాకులు, బండలపై భద్రపరచాలని, అవసరమైన ఆహార పదార్థాలను మూత ఉన్న డబ్బాలు, కంటైనర్లలో నిల్వ చేయాలని సూచించారు. వంటశాల, స్టోర్ రూమ్‌తో పాటు పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ రోజు మెనూలో భాగంగా విద్యార్థులకు తయారు చేస్తున్న చికెన్ కూర నాణ్యతను కూడా కలెక్టర్ పరిశీలించారు. చికెన్ ఎంత పరిమాణంలో వినియోగిస్తున్నారని, ఒక్కో విద్యార్థికి ఎంత పరిమాణంలో అందిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 80 కిలోల చికెన్‌ను వంటకు వినియోగిస్తున్నామని, ఒక్కో విద్యార్థికి సుమారు 120 గ్రాముల చొప్పున అందిస్తున్నామని సిబ్బంది కలెక్టర్‌కు తెలిపారు. వంట అనంతరం భోజన నాణ్యతను పరిశీలించి, విద్యార్థులకు సమయానికి, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, ఆరోగ్యకరమైన ఆహారం, అవసరమైన వైద్య సదుపాయాలు అందేలా పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని, పాఠశాల పరిసరాలు, కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ములకలపల్లి తాసిల్దార్ స్వాతి బిందు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 99 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**- జాతీయ ఆరోగ్య మిషన్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టులు**
**- ఈ నెల 8 నుంచి 13 వరకు దరఖాస్తుల స్వీకరణ**
**: డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామారావు**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 7 (భద్రాద్రిన్యూస్) :** ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్ లో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీలకు చెందిన 99 పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. రామారావు తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.
దరఖాస్తుల వివరాలు:
పోస్టుల సంఖ్య: 99
నియామక విధానం: కాంట్రాక్ట్ / ఔట్‌సోర్సింగ్
దరఖాస్తుల స్వీకరణ: 08-10-2026 నుంచి 13-10-2026 వరకు
సమయం: కార్యాలయ పనివేళల్లో సాయంత్రం 5 గంటల వరకు
అర్హులైన అభ్యర్థులు ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిగా నింపిన దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, కులం, స్థానికత తదితర సంబంధిత ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను జతచేసి సమర్పించాలి.
దరఖాస్తు సమర్పించాల్సిన చిరునామా:
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం,
రూమ్ నం. **F-1**, కలెక్టరేట్ కాంప్లెక్స్ **(IDOC)**,
వి. వెంకటాయపాలెం, ఖమ్మం.
పోస్టుల వారీగా విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక నిబంధనలు, ఇతర పూర్తి వివరాలను ఖమ్మం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని అధికారులు సూచించారు. నిర్ణీత గడువు 13-10-2026 సాయంత్రం 5 గంటల తర్వాత అందే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.

# దసరా రద్దీకి ఆర్టీసీ సన్నద్ధం

**- ప్రయాణికుల కోసం 1,642 ప్రత్యేక బస్సులు**
**- ఖమ్మం రీజియన్ పరిధిలో 909 బస్సులు**
**- హైదరాబాద్‌కు.. 733 బస్సులు హైదరాబాద్ నుంచి జిల్లాకు**

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 7( భద్రాద్రిన్యూస్ ):**
దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఖమ్మం రీజియన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రయాణికులు తమ స్వస్థలాలకు సౌకర్యవంతంగా చేరుకునేందుకు అక్టోబర్ 9 నుంచి 20వ తేదీ వరకు 1,642 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు 909 ప్రత్యేక బస్సులు, హైదరాబాద్ నుంచి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు 733 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు, అలాగే ఆయా ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికుల అవసరాలను బట్టి అదనపు బస్సులను అందుబాటులో ఉంచనున్నారు.
ప్రత్యేక బస్సుల వివరాలు:

| డిపో | హైదరాబాద్ నుంచి జిల్లాకు | జిల్లా నుంచి హైదరాబాద్‌కు | మొత్తం |
|---|---|---|---|
| ఖమ్మం | 279 | 216 | 495 |
| మధిర : 191, 102, 293 | | | |
| సత్తుపల్లి | 172 | 140 | 312 |
| తల్లాడ : 114, 132, 246 | | | |
| కొత్తగూడెం | 68 | 57 | 125 |
| మణుగూరు | 55 | 50 | 105 |
| భద్రాచలం | 30 | 36 | 66 |
| మొత్తం | 909 | 733 | 1,642 |

అలాగే అక్టోబర్ 9 నుంచి 20 వరకు హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు, తిరిగి అక్టోబర్ 21 నుంచి 25 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అవసరమైన ప్రాంతాలకు అదనపు బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టనున్నారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యేక బస్సుల రాకపోకల వివరాలను టీజీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్, గమ్యం (ఖుఎఖుఎ) యాప్, ఏటిబీ (ఖాదీ) మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# గ్యార్వీ షరీఫ్ ఫాతిహాలో పాల్గొన్న అహ్లే సున్నత్ వల్ జమాత్ అధ్యక్షులు



**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్)** : గ్యార్వీ షరీఫ్ ఫాతిహా కార్యక్రమంలో అహ్లే సున్నత్ వల్ జమాత్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ముస్లింలందరి శాంతి, సౌభాగ్యం, భద్రత, అభివృద్ధి, క్షేమం కోసం దువా చేశారు. ఈ కార్యక్రమంలో సున్నత్ వల్ జమాత్ కమిటీ చైర్మన్ ఎం.డి. గౌస్ మొయినుద్దీన్, అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, జనరల్ సెక్రటరీ ఎం.డి. హుస్సేన్ ఖాన్, వైస్ చైర్మన్ షేక్ అబ్దుల్ కరీం, వైస్ ప్రెసిడెంట్లు షేక్ యాకూబ్ ఖాద్రి, షేక్ షమ్మీఉద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్లు సయ్యద్ యూసుఫ్ ఖాద్రి, షఫీ ఖాద్రి, మహబూబ్ ఖాద్రి, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ నయీమ్ చిష్తితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
గురువారం
8 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# ఇసుక రవాణాలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : కలెక్టర్ అంకిత్

- ఇసుక వాహనాల రాకపోకలకు సమర్థవంతమైన ప్రణాళిక రూపొందించాలి : ఎస్పీ రోహిత్ రాజు
- హోల్డింగ్, పార్కింగ్ ప్రాంతాలను సద్వినియోగం చేసుకోవాలి
- అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి




**భద్రాద్రి కొత్తగూడెం ,అక్టోబర్ 7 (భద్రాద్రిన్యూస్ ):**

జిల్లాలో ఇసుక రవాణా కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తో కలిసి బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం లో ఇసుక రవాణా, వాహనాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ప్రాంతాలు, అక్రమ ఇసుక రవాణా తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇసుక వాహనాల రాకపోకలు అధికంగా ఉన్న మణుగూరు, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు ప్రాంతాల్లో రోడ్ల సామర్థ్యం, ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాహనాల ఎంట్రీ, ఎగ్జిట్‌లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో లారీలు రోడ్లపైకి రాకుండా అవసరానికి అనుగుణంగా దశలవారీగా వాహనాలను పంపించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మణుగూరు, రామాంజవరం ప్రాంతాల్లో అవసరమైన హోల్డింగ్, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని, చర్ల నుంచి భద్రాచలం మార్గంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం రహదారి మరమ్మతుల నాణ్యతపై తక్షణమే పరిశీలన చేసి నివేదిక అందించాలని సూచించారు. బూర్గంపాడు పరిధిలో గొల్లగూడెం, సారపాక బ్రిడ్జి, తాళ్లగూడెం, ఉప్పాక, పినపాక పట్టినగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక రవాణా వల్ల ఏర్పడుతున్న సమస్యలను గుర్తించి ప్రత్యామ్నాయ పార్కింగ్, హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ఇసుక రవాణా పెరిగే ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా ట్రాఫిక్ మార్షల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మణుగూరు, చెర్ల ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా టీజీఎండీసీ అధికారులతో సమన్వయం చేసుకొని వాహనాల సాఫీ రాకపోకలకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఒకేసారి అదనంగా వాహనాలు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే విధంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాలోకి అక్రమంగా ఇసుక రవాణా జరిగే అవకాశాలను నిరోధించేందుకు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. సీజ్ చేసిన ఇసుకను అక్కడే నిల్వ ఉంచకుండా తదుపరి చర్యల కోసం తరలించేలా ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వాహనాలు, జేసీబీలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఇసుక రవాణా, ట్రాఫిక్ నిర్వహణ, అక్రమ ఇసుక రవాణా నియంత్రణలో పోలీసు, రెవెన్యూ, టీజీఎండీసీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్ఓ పద్మావతి,కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి మైన్స్ దినేష్, జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, తాసిల్దారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# నాయి బ్రాహ్మణుల సమస్యలు పట్టించుకోరా?

**- కులవృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు అండేది? సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలి.. ఆధునిక పరికరాలు, స్వయం ఉపాధికి ఆర్థిక సహాయం కల్పించాలని డిమాండ్**



**చర్ల, అక్టోబర్ 7 ( భద్రాద్రి న్యూస్ ):** నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం భద్రాచలం డివిజన్ అధ్యక్షులు తోటపల్లి రమణ, ఉపాధ్యక్షులు అందుర్తి వెంకట్రావు కోరారు. తరతరాలుగా సంప్రదాయ కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నాయి బ్రాహ్మణ కుటుంబాలు ప్రస్తుతం అనేక ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని వారు పేర్కొన్నారు.

**పథకాలు ఉన్నా.. ప్రయోజనం అందుతోందా?**

నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జీవోలు క్షేత్రస్థాయిలో అర్హులైన కుటుంబాలకు పూర్తిస్థాయిలో చేరడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం, రుణాల విషయంలో ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

**కులవృత్తికి ఆధునికత అవసరం**

కులవృత్తిని కొనసాగిస్తున్న వారికి ఆధునిక పరికరాలు అందించడంతో పాటు వృత్తి అభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయం, సబ్సిడీ రుణాలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, నాయి బ్రాహ్మణ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

**సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ**

నాయి బ్రాహ్మణుల సంక్షేమం, కులవృత్తి పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తోటపల్లి రమణ, అందుర్తి వెంకట్రావు కోరారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గోదావరి పుష్కర పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి : కలెక్టర్ అంకిత్

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కర ఏర్పాట్లు పూర్తి చేయాలి
- గోదావరి పుష్కరాల నోడల్ అధికారిగా భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలి
- ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలి : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




**భద్రాద్రి కొత్తగూడెం ,అక్టోబర్ 7 (భద్రాద్రిన్యూస్ ):**

వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని పుష్కర ఘాట్ల వద్ద చేపట్టిన పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరం లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులచే ప్రారంభమైన పనులతో పాటు మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ, సీపీఓ కార్యాలయం నుంచి పుష్కరాల కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని ఎస్పీ రోహిత్ రాజు, సీపీఓ సునీతలను ఆదేశించారు. గోదావరి పుష్కరాల పనుల పర్యవేక్షణకు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్‌ను నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పుష్కరాలకు మరో పది నెలల సమయం మాత్రమే ఉన్నందున పనుల పురోగతిని నోడల్ అధికారికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని, వారానికొకసారి పనులను సమీక్షించి పురోగతి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.

భద్రాచలం పుష్కర క్షేత్రానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు . ఎండోమెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్య, పోలీస్ తదితర శాఖలు తమ పరిధిలోని పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. దుమ్ముగూడెం, పర్ణశాల, మోతేపట్టి నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్లకు సంబంధించి టైర్-1, టైర్-2, టైర్-3 కింద చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. పుష్కరాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్, అప్రోచ్ రోడ్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు తదితర మౌలిక వసతులను ముందస్తుగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఘాట్లకు చేరుకునే రహదారులు, ఘాట్ల మరమ్మతు పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. 2015లో నిర్వహించిన గోదావరి పుష్కరాలకు సంబంధించిన వివరాలను సేకరించి సమగ్ర నివేదికతో పాటు సుమారు 30 పేజీల ప్రత్యేక బుక్‌లెట్‌ను రూపొందించాలని సీపీఓ సునీతను కలెక్టర్ ఆదేశించారు. పుష్కర ఘాట్ ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన సూచనలు సులభంగా అందేలా డీడబ్ల్యూఓ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గుర్తింపు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుష్కరాల సమయంలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను తరలించేందుకు గతంలో వినియోగించిన 30 ఎకరాల డంపింగ్ స్థలాన్ని అవసరమైతే తిరిగి వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణలో అన్ని శాఖలు తమ బాధ్యతలను స్పష్టంగా గుర్తించి పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో ట్రాఫిక్, భక్తుల రద్దీని ముందస్తు ప్రణాళికతో సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పార్కింగ్ ప్రాంతాలు, హోల్డింగ్ ఏరియాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను సంబంధిత శాఖలు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖరారు చేయాలని సూచించారు. ప్రధాన రహదారులపై చేపట్టే మరమ్మతులు, రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ముందుగానే స్థానిక పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. పాల్వంచ--దమ్మపేట, తల్లాడ--భద్రాచలం, బయ్యారం, దుమ్ముగూడెం తదితర ప్రధాన మార్గాల్లో రహదారుల పరిస్థితిని ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలు, హోల్డింగ్ ప్రాంతాలను సిద్ధం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. హోల్డింగ్ ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, లైటింగ్ వంటి ప్రాథమిక సదుపాయాలు ఉండేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. భక్తులకు మార్గదర్శకంగా ట్రాఫిక్ సైన్‌బోర్డులు, ఎల్‌ఈడీ డిస్‌ప్లేలు, దిశానిర్దేశక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఘాట్ల వద్ద భక్తుల ప్రవేశం, నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, అన్ని శాఖలు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చివరి నిమిషంలో పనుల ఒత్తిడి లేకుండా నిర్ణీత గడువుకు ముందుగానే పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. శ్రీరామనవమి, ముక్కోటి వంటి ప్రధాన కార్యక్రమాల కారణంగా అధికార యంత్రాంగంపై అదనపు పనిభారం ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్, డీఆర్ఓ పద్మావతి, డీపీఓ అనూష, డీటీఓ భూషిత్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం పట్టణ 1వ టౌన్ సీఐ కరుణాకర్ సేవలు అమోఘం

**- జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**




**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం వన్ టౌన్ సీఐ గా కరుణాకర్ విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తూ శాంతి భద్రతలను కాపాడుతూ ఈ ప్రాంత వాసులకు అమోఘమైన సేవలు అందించి సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. కరుణాకర్ ఇక్కడి నుంచి బదిలీపై వెళుతున్న సందర్భంగా బుధవారం ఆయన్ని స్థానిక పోలీస్ స్టేషన్ లో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా యెర్రా కామేష్ మాట్లాడుతూ... గడిచిన నాలుగేళ్లలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అద్భుతమైన పని తీరుతో అన్ని వర్గాల ప్రజల మన్ననలు అందుకున్న ఏకైక అధికారి కరుణాకర్ అని ప్రశంసించారు. ముఖ్యంగా ఎన్నికలు, పండుగల ఉత్సవాల సమయంలో సంయమనం పాటిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు కూడా పొందారని గుర్తు చేశారు. ఉద్యోగ రీత్యా కరుణాకర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, బంటు నరేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ల వెరిఫికేషన్ చేసిన జడ్పీ డిప్యూటీ సీఈవో అప్పారావు



**గుండాల- అక్టోబర్, 7: భద్రాద్రి న్యూస్ :** గుండాల మండలం కాచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఈరోజు జెడ్పి డిప్యూటీ సీఈవో అప్పారావు ప్రతి ఇంటికి తిరుగుతూ చేయూత పెన్షన్ల వెరిఫికేషన్ చేశారు వారి వెంట గుండాల ఎంపీడీవో బాలరాజు, గ్రామపంచాయతీ సర్పంచ్ జరుపుల కిషన్, పంచాయతీ కార్యదర్శి కొరస ఉమాదేవి,కారోబార్ మందపురి సంపత్ ఉన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ... ప్రభుత్వం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలి

- అందుకు మంత్రి పొంగులేటి చొరవ తీసుకోవాలి
- వేతనాలు, హక్కులు, సంక్షేమ పథకాల అమలు కోసం జేఏసీ ఏర్పాటు
- డెస్క్ జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ ప్రత్యేక దృష్టి
- కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు ఏఐపై పట్టు సాధించాలి
- వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్

**ఖమ్మం ప్రతినిధి ,అక్టోబర్ 7 (భద్రాద్రిన్యూస్):** జర్నలిస్టుల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు అన్ని జర్నలిస్టు సంఘాలతో కలిపి హైదారాబాద్ లో ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు రాష్ట్ర పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేయక పోతే, జర్నలిస్టుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం ఖమ్మంలోని టీటీడీసీ బిల్డింగ్ లో డబ్ల్యూజేఐ ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్ అధ్యక్షతన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల యూనియన్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాణా ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోవు రోజుల్లో జర్నలిస్టుల సమస్యలపై పోరాడేందుకు ఆన్ని జర్నలిస్టు సంఘాలతో కలిపి జేఏసీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఇది కేవలం రాష్ట్రానికే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా వివిధ జర్నలిస్టు సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఐక్య పోరాటాలు సాగిస్తామన్నారు. జర్నలిస్టులకు చట్ట బద్ధంగా దక్కాల్సిన వేతనాలు, సంక్షేమ పథకాలు, అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, హక్కుల సాధన కోసం డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో కూడా నిరంతర పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ రంగంలో పని చేస్తున్న వేలాది మంది జర్నలిస్టులు కనీస వేతనాలు, భద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా యాజమాన్యాలు కనీస వేతనాలు కూడా చెల్లించకుండా జర్నలిస్టులతో వెట్టి చాకిరీ చేయించుకోవడం దారుణమని, జర్నలిస్టులకు న్యాయంగా దక్కాల్సిన వేతనాలు, ఇతర సదుపాయాల కోసం యాజమాన్యాలపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేకించి డెస్క్ జర్నలిస్టుల సమస్యలపై కూడా తమ సంఘం దృష్టి సారిస్తుందన్నారు. ప్రభుత్వ పరంగా జర్నలిస్టులకు అమలుకావాల్సిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయించేందుకు సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా పని చేస్తూ, దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్మిస్తోందని తెలిపారు. ప్రస్తుతం జర్నలిజంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోక పోతే జర్నలిస్టులు వెనుకబడే ప్రమాదం ఉందని రాణా ప్రతాప్ హెచ్చరించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ప్రతి జర్నలిస్టు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఐ సాయంతో వార్తలను రూపొందించే విధానాలు, వార్తా రచనలో సాంకేతికతను వినియోగించుకునే పద్ధతులను ఆయన వివరించారు.

**సంఘాన్ని మరింత విస్తరించాలి: రాష్ట్ర కార్యదర్శి ఎన్.ఎస్ రావు**

డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వర రావు (ఎన్.ఎస్ రావు) మాట్లాడుతూ రానున్న ఒకటీ, రెండు నెలల్లో యూనియన్ ను మరింత ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం వుందన్నారు. అందుకు ప్రతి సభ్యుడు కృషి చేయాలని, సభ్యత్వాల నమోదును పెంచాలని కోరారు. అలాగే, ఎప్పటికప్పుడు స్థానిక జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగించాలని పిలుపు నిచ్చారు. పోరాటాల ద్వారానే సంఘం బలోపేతమవుతుందని, ఆ దిశగా ప్రతి జిల్లాలో కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం డబ్ల్యూజేఐ సభ్యులకు డిజిటల్ గుర్తింపు కార్డులను అందజేసి, సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ డబ్ల్యూజేఐ జిల్లా కన్వీనర్ హెచ్. రామకృష్ణా రెడ్డి, టీజేఏ ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు మణి కుమార్, డబ్ల్యూజేఐ ఖమ్మం జిల్లా కోకన్వీనర్లు ఎం.ఏ అన్సార్ పాషా, ఎన్. రామకృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోకన్వీనర్ కోలే దామోదర్, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జి కె. కళ్యాణ్ చక్రవర్తి, వివిధ జిల్లాల నాయకులు జాబిశెట్టి కుటుంబ రావు, గోగుల నారాయణ రావు, కట్టెకోల చిన నరసయ్య, మోడెపల్లి కిరణ్, ఏనిగండ్ల శ్రీనివాస్, నల్లా జగన్ రెడ్డి, జానీ, వేర్పుల సాగర్, పొనకంటి ఉపేందర్, బొడ్డుపల్లి రవీందర్, పసుపులేటి ఉపేందర్, వుల్లోజి హరీష్, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.






# ఘనంగా 'కిరణ్స్ జోన్ సోషల్'

**- ఉత్తమ క్లబ్, అధ్యక్షులకు 'బోనగిరి ఉషా కిరణ్ సేవా పురస్కారాలు'**

**సేవా కార్యక్రమాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వాసవి క్లబ్‌లకు ఘన సత్కారం**

ఇల్లందు, అక్టోబర్ 7 (భద్రాద్రిన్యూస్) :- వాసవి క్లబ్స్ డిస్ట్రిక్ట్ ఎ-106ూ, రీజియన్-III, జోన్-III ఆధ్వర్యంలో జోన్ చైర్మన్ బోనగిరి రవి కిరణ్ నిర్వహించిన 'కిరణ్స్ జోన్ సోషల్' కార్యక్రమం ఇల్లందు కళాసిబస్తీలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా జరిగింది.

ఈ సందర్భంగా 2026 సంవత్సరంలో సేవా కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బెస్ట్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ జనరల్ సెక్రటరీ, బెస్ట్ ట్రెజరర్ అవార్డులతో పాటు ప్రత్యేకంగా 'బోనగిరి ఉషా కిరణ్ సేవా పురస్కారాలు' అందజేశారు.

కార్యక్రమానికి వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ **(M) V.N.** గోద్దెన్ స్టార్ **KCGF** గెల్లా కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జోన్ అబ్జర్వర్‌గా ఎ.చీ. సిల్వర్ స్టార్ **KCGF** వాసవి దాత మంకాల మల్లేశ్వర్ పాల్గొన్నారు.

జోన్ చైర్మన్ బోనగిరి రవి కిరణ్ మాట్లాడుతూ తన పరిధిలోని వాసవి క్లబ్ ఇల్లందు, వనిత క్రౌన్ ఇల్లందు, గ్రీన్‌ఫీల్డ్ గుండాల మూడు క్లబ్‌లు 2026లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి విశేష గుర్తింపు పొందాయని తెలిపారు. క్యాలెండర్‌లోని కార్యక్రమాలతో పాటు అదనంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మిగిలిన మూడు నెలల్లోనూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టి, సాధ్యమైనంత వరకు శాశ్వత సేవా ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని సూచించారు.

**ఉత్తమ ప్రతిభకు అవార్డులు**

2026 సంవత్సరానికి బెస్ట్ క్లబ్‌గా వాసవి క్లబ్ ఇల్లందు ఎంపికైంది. ఆ క్లబ్ అధ్యక్షుడు కటకం సత్యేంద్ర కుమార్ అవార్డు అందుకున్నారు. బెస్ట్ ప్రెసిడెంట్‌గా వనిత క్రౌన్ అధ్యక్షురాలు కటకం అలేఖ్య, బెస్ట్ జనరల్ సెక్రటరీగా తీర్దాల నాగరాజు, బెస్ట్ ట్రెజరర్‌గా సముద్రాల ఉషారాణి ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బోనగిరి రవి కిరణ్ 2025లో విజయవంతమైన అధ్యక్షుడిగా సేవలందించి వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ స్థాయిలో బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్నారని కొనియాడారు. 2026లో జోన్ చైర్మన్‌గా కూడా అత్యుత్తమ సేవలందిస్తూ, తన పరిధిలోని మూడు క్లబ్‌ల అధ్యక్షులు, సభ్యులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారిని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. అలాగే ఇల్లందులో నిర్వహించిన వాసవి మాత జయంతి కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించి, ఇల్లందు వాసవి క్లబ్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచేలా చేశారని ప్రశంసించారు. బోనగిరి రవి కిరణ్ మాట్లాడుతూ తనకు పూర్తి స్థాయిలో సహకరిస్తూ మూడు క్లబ్‌లను జిల్లాలో ముందువరుసలో నిలిపిన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "నా విజయం వెనుక నా మూడు క్లబ్‌ల టీమ్‌వర్క్ ఉంది. ఇల్లందు ఆర్యవైశ్యుల సహకారం మరువలేనిది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇల్లందు, వనిత క్రౌన్ ఇల్లందు, గ్రీన్‌ఫీల్డ్ గుండాల అధ్యక్షులు కటకం సత్యేంద్ర కుమార్, కటకం అలేఖ్య, మానాల శ్రవణ్, ప్రధాన కార్యదర్శులు తీర్దాల నాగరాజు, రాచర్ల వాణి, మానాల ఉపేందర్, కోశాధికారులు బోనగిరి రమేష్, సముద్రాల ఉషారాణి, తవిడిశెట్టి రాంబాబు తదితరులతో పాటు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ ఆర్గనైజర్లు, క్యాబినెట్ జాయింట్ సెక్రటరీలు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, మాజీ అధ్యక్షులు, వాసవియన్లు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సభ్యులు కటకం పెద్ద సత్యనారాయణ, కటకం చిన్న సత్యనారాయణ, రాచర్ల కృష్ణ, కటకం సుమన్, బోనగిరి కల్పన, కటకం కళావతి, కటకం ప్రణవి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఆదివాసి హక్కుల కోసం యువత కదలాలి!

**- నీరు.. అడవి.. భూమి.. విద్య.. వైద్యం.. ఉద్యోగాలపై పోరాటమే మార్గం..**

**- డిసెంబర్ 9న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభకు పిలుపు.. వాజేడు మండల తుడుం దెబ్బ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**





**వాజేడు, అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్):**

ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం యువతీ యువకులు ముందువరుసలో నిలిచి పోరాటాలను బలోపేతం చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. మైపతి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు నిరంతర పోరాటం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. వాజేడు మండలం చెరుకూరు గ్రామంలో బుధవారం ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. మైపతి అరుణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడేందుకు యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

**డిసెంబర్ 9న చలో హైదరాబాద్ :**

ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 9న నిర్వహించనున్న చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వాజేడు మండలంలోని చెరుకూరు గ్రామం నుంచి భారీ సంఖ్యలో ఆదివాసీ ప్రజలు, యువత, విద్యార్థులు తరలిరావాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలు ఎదుర్కొంటున్న నీరు, అడవి, భూమి, విద్య, వైద్యం, ఉద్యోగాలు తదితర సమస్యలపై గళమెత్తాలని సూచించారు. తరతరాలుగా ఆదివాసీల జీవనాధారంగా ఉన్న జల, జంగల్, జమీన్‌పై వారి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం సంఘటితంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

**వాజేడు తుడుం దెబ్బకు నూతన కమిటీ:**

అనంతరం వాజేడు మండల తుడుం దెబ్బ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అట్టం శివకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా పట్టం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా మొడెం సందీప్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆలేం సురేష్, ఉపాధ్యక్షులుగా గొంది యోగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గుండెబోయిన శరత్, కోశాధికారిగా మడే రవి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వాసం రవి, కుర్సం శ్రీకాంత్, కార్యదర్శులుగా గొంది మల్లికార్జున్, ఆలం కిషోర్ ఎన్నికయ్యారు.

**ఆదివాసీ విద్యార్థి సంఘం కమిటీ కూడా ఏకగ్రీవం :** ఆదివాసీ విద్యార్థి సంఘం మండల కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొంది మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఇరుప భరత్, ఉపాధ్యక్షులుగా అట్టం సంపత్‌కుమార్, వాసం బాలు ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా బండారి ఉదయ్, మడి వేణు, యలం రవికుమార్, బోదబోయిన సమ్మయ్య, కుడుముల తరుణ్ ఎన్నికయ్యారు.

**జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ బాధ్యతలు**

ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చింత మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడిగా పద్దం సుధాకర్, జిల్లా ప్రచార కార్యదర్శిగా గొంది రామలక్ష్మణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అట్టం సుభద్ర, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిషే బాలకృష్ణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేగ గణేష్, తుడుం దెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూణేం చంటి పాల్గొన్నారు. వాజేడు మండలంలోని ఆదివాసీ యువత, విద్యార్థులు, మహిళలు, ప్రజలు వందల సంఖ్యలో హాజరై నూతన కమిటీలకు అభినందనలు తెలిపారు. ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. డిసెంబర్ 9న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో ప్రజలను సమీకరించాలని సూచించారు.

# పుసుగుప్ప పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య శిబిరం

**- 22 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు.. మందుల పంపిణీ.. పరిశుభ్రతపై అవగాహన కల్పించిన వైద్య సిబ్బంది**




**చర్ల, అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్):**

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పుసుగుప్ప ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హారిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అనారోగ్య సమస్యలపై వైద్య సిబ్బంది ఆరా తీశారు. శిబిరంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 22 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. పలువురు విద్యార్థుల్లో చర్మ సంబంధిత సమస్యలను గుర్తించిన వైద్య సిబ్బంది.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.

**సీజనల్ వ్యాధులపై అవగాహన :**

వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది విద్యార్థులకు సూచించారు. ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉండటం, శుభ్రమైన దుస్తులు ధరించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను పెంపొందించుకోవాలని తెలిపారు. భోజనానికి ముందు, భోజనం అనంతరం, మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. జ్వరం, చర్మ సమస్యలు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా తల్లిదండ్రులకు తెలియజేసి వైద్యులను సంప్రదించాలని అవగాహన కల్పించారు.

**మధ్యాహ్న భోజనం పరిశీలన :**

అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని వైద్య సిబ్బంది పరిశీలించారు. ఆహారం తయారీ, పరిశుభ్రత, నాణ్యత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రంగా, సురక్షితంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుందని వైద్య సిబ్బంది తెలిపారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై చిన్న వయసు నుంచే అవగాహన పెంపొందించడం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, ఉపాధ్యాయులు కవిత, ప్రణతి, ఆశా కార్యకర్తలు లావణ్య, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడిగా జే.ప్రేమ్ సింగ్

**- ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్ ఏకగ్రీవ ఎన్నిక**



**కామేపల్లి,అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండలం ఏజెన్సీ ప్రాంతం కెప్టెన్ బంజారా గ్రామానికి చెందిన గిరిజన యువకుడు విద్యావంతుడు ఉపాధ్యాయుడు జరపల ప్రేమ్ సింగ్ కి ఉపాధ్యాయ సంఘం వారికి బాధ్యతలు అందించడంతో ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విలేకరులకు తెలిపారు. అశ్వారావుపేట మండల కేంద్రంలో తెలంగాణ ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయుల ఫెడరేషన్ మండల సాధారణ సభ అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకగా సాగిన సమావేశంలో ఉపాధ్యాయుల సమైక్యత,సంఘ బలోపేతం వారి హక్కుల సాధనే ధ్యేయంగా నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల్లో భాగంగా అశ్వారావుపేట మండల నూతన అధ్యక్షుడిగా జే. ప్రేమ్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా జి. రమేష్‌లను ఉపాధ్యాయులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మండల స్థాయి పూర్తి స్థాయి నూతన బాధ్యులను కార్యవర్గ సభ్యులను కూడా సభ సమక్షంలో అధికారికంగా ప్రకటించి ఎన్నుకోవడం జరిగింది. ఈ విశేష కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కౌన్సిలర్ కె. మాధవ రెడ్డి.జిల్లా బాధ్యులు బి. హనుమంతు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యా రంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, పాఠశాలల బలోపేతానికి నూతనంగా ఎన్నికైన నాయకత్వం ముందుండాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు,సంఘ పురోగతికి నిరంతరం శ్రమించాలని పిలుపునిస్తూ నూతన బాధ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఉపాధ్యాయులు, సంఘ ప్రతినిధులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# నేడు కామేపల్లి, ముచ్చర్ల రెవెన్యూ పరిధిలో సీతారామ ప్రాజెక్టు భూసేకరణ గ్రామసభలు

**- మండల తహసిల్దార్ శ్రీనివాసరావు**



**కామేపల్లి,అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్):** సీతారామ ప్రాజెక్టు కాలువల భూసేకరణ ప్రక్రియలో భాగంగా నేడు గురువారం, మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు కామేపల్లి తహసీల్దార్ ప్రకటనలో తెలిపారు.కామేపల్లి ముచ్చర్ల రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూసేకరణపై చర్చించేందుకు ఉదయం 10 .గంటలకు ముచ్చర్ల గ్రామపంచాయతీలో కార్యాలయంలో గ్రామసభ మరియు కామేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్నం 1.గంటకు ఈ సంయుక్త సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ (రెవెన్యూ) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రాజెక్టు కాలువల పరిధిలోకి వచ్చే కామేపల్లి, ముచ్చర్ల రెవెన్యూ గ్రామాల రైతులు, భూస్వాములు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను తెలపాలని తహసీల్దార్ కోరారు.

# దమ్మపేట బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలి..

**- పెట్రోల్ బంకును తొలగించాలి**




**భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । అక్టోబర్ 7 :** దమ్మపేట బస్టాండ్‌లో నిర్మించిన పెట్రోల్ బంకును తొలగించి, బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకులు పండూరి వీరబాబు డిమాండ్ చేశారు. బస్టాండ్‌లో పెట్రోల్ బంకు నిర్మాణంపై గతంలో ప్రజలు ఆందోళనలు నిర్వహించి, కోర్టును ఆశ్రయించారని తెలిపారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించి పెట్రోల్ బంకును తొలగించాలని కోరారు. దమ్మపేట బస్టాండ్ అభివృద్ధికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రూ.95 లక్షలు కేటాయించారని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు బస్టాండ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పెట్రోల్ బంకు తొలగింపు విషయంలో ప్రజల పక్షాన తమ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని, అవసరమైతే ఎలాంటి కేసులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వీరబాబు స్పష్టం చేశారు.

# గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**- గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బాధావత్ శ్రీను పిలుపు**



**కామేపల్లి,అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్):** అక్టోబర్ 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో నిర్వహించనున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను గిరిజనులంతా పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు బాధావత్ శ్రీను పిలుపునిచ్చారు. బుధవారం కామేపల్లి మండలం రేపల్లెవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన గిరిజనుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ?ఈ సందర్భంగా బాధావత్ శ్రీను మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజన జనాభా అధికంగా ఉన్నప్పటికీ,వారికి అందాల్సిన సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో చేరడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించి పథకాలను పక్కాగా అమలు చేయాలని కోరారు.ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

?తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన గిరిజన యోధుడు ఠాను నాయక్ స్మారకార్థం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని విజ్ఞప్తి చేశారు. పాలనా సౌలభ్యం, గిరిజన ప్రాంతాల శీఘ్రగతిన అభివృద్ధి కోసం రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో 'ఐటీడీఏ' కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో వ్యవహరించి గిరిజనుల సమస్యల పరిష్కారానికి, మూల ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
గురువారం
8 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# ఇసుక రవాణాలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

**– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్) :** అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి జిల్లాలో ఇసుక రవాణా కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తో కలిసి బుధవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో ఇసుక రవాణా, వాహనాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ప్రాంతాలు, అక్రమ ఇసుక రవాణా తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇసుక వాహనాల రాకపోకలు అధికంగా ఉన్న మణుగూరు, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు ప్రాంతాల్లో రోడ్ల సామర్థ్యం, ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాహనాల ఎంట్రీ, ఎగ్జిట్‌లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో లారీలు రోడ్లపైకి రాకుండా అవసరానికి అనుగుణంగా దశలవారీగా వాహనాలను పంపించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మణుగూరు, రామాంజవరం ప్రాంతాల్లో అవసరమైన హోల్డింగ్, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని, చర్ల నుంచి భద్రాచలం మార్గంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం రహదారి మరమ్మతుల నాణ్యతపై తక్షణమే పరిశీలన చేసి నివేదిక అందించాలని సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ... ఇసుక రవాణా పెరిగే ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా ట్రాఫిక్ మార్షల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మణుగూరు, చెర్ల ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా టీజీఎండీసీ అధికారులతో సమన్వయం చేసుకొని వాహనాల సాఫీ రాకపోకలకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఒకేసారి అదనంగా వాహనాలు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే విధంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాలోకి అక్రమంగా ఇసుక రవాణా జరిగే అవకాశాలను నిరోధించేందుకు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. సీజ్ చేసిన ఇసుకను అక్కడే నిల్వ ఉంచకుండా తదుపరి చర్యల కోసం తరలించేలా ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వాహనాలు, జేసీబీలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనల ప్రకారం జరిమానాలు



విధించాలని ఆదేశించారు. ఇసుక రవాణా, ట్రాఫిక్ నిర్వహణ, అక్రమ ఇసుక రవాణా నియంత్రణలో పోలీసు, రెవెన్యూ, టీజీఎండీసీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్ఓ పద్మావతి,కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి మైన్స్ దినేష్, జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, తాసిల్దారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయే రైతులకు మెరుగైన నష్టపరిహారం చెల్లిస్తాం

**- భూసేకరణ సర్వేకు రైతులు సహకరించాలి**

**- సీతారామ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం**



**కామేపల్లి,అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్):** సీతారామ ప్రాజెక్టు కాలువల కింద భూములు కోల్పోయే రైతులకు మెరుగైన నష్టపరిహారం చెల్లిస్తామని రైతులందరూ భూ సేకరణ సర్వేకు సహకరించాలని సీతారాం ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం విజ్ఞప్తి చేశారు.బుధవారం మండలంలోని కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన కొండాయిగూడెం, కొమ్మినేపల్లి, రెవెన్యూ గ్రామాల సీతారామ ప్రాజెక్ట్ కాలువల రైతుల భూసేకరణ అవగాహన సభలోఆయన పాల్గొని మాట్లాడుతూ 2 వేల కోట్లతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు ద్వారా పదివేల ఎకరాల సాగు భూమికి గోదావరి జలాలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. కొమ్మినేపల్లి, కొండాయిగూడెం రెవెన్యూ గ్రామాల పరిధిలో కాలువల నిర్మాణాలకు 100 ఎకరాలు భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం భూమి విలువకు అదనంగా మూడు రేట్లు రైతులకు చెల్లించడం జరుగుతుందని తెలిపారు.భూమితో పాటు అందులో ఉండే ఆస్తులకు కూడా విలువ కట్టించి పరిహారం అందించడం జరుగుతుందని వివరించారు . రైతులు అందుబాటులో ఉండి ఫీల్డ్ లో సర్వేకు సహకరించాలని తమ తమ భూముల వివరాలు నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు, సీతారామ ప్రాజెక్టు (ఇరిగేషన్) డిఈ మోతిలాల్, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్,గ్రామ సర్పంచ్ అనురాధ బాయి.ఉప సర్పంచ్ మేకల మల్లికార్జున్ రావు,జిపిఓ కందయ్య,గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకర్, రెవిన్యూ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య కార్మికులకు అన్యాయం చేయొద్దు

**- 1,800 మంది కార్మికులకు అన్‌ఫిట్ కోసం ఎదురుచూపులు. రీ-మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి**

**- సింగరేణి సంస్థలో నిర్వహిస్తున్న కార్పొరేట్ మెడికల్ బోర్డు విధానాన్ని యాజమాన్యం పునఃసమీక్షించాలని**

**- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్**

**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్)** : తీవ్ర అనారోగ్య సమస్యలతో విధులు నిర్వహించలేని కార్మికులకు వైద్యపరమైన న్యాయం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. అన్‌ఫిట్ నిర్ధారణ ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, అర్హులైన కార్మికులకు నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో ఇటీవల నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డుల్లో అన్‌ఫిట్‌గా నిర్ధారణ అవుతున్న కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. గత మెడికల్ బోర్డుల్లో వరుసగా సుమారు 4 శాతం, 14 శాతం, 10 శాతం మాత్రమే కార్మికులు అన్‌ఫిట్‌గా నిర్ధారణ అయిన పరిస్థితిపై యాజమాన్యం సమగ్ర సమీక్ష నిర్వహించాలని కోరారు.గుండె సంబంధిత సమస్యలతో స్టెంట్లు వేయించుకున్న కార్మికులు, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారు, శారీరకంగా కఠినమైన విధులు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్న కార్మికులు సైతం అన్‌ఫిట్‌గా నిర్ధారణ కాకపోవడం విచారకరమన్నారు. కార్మికుల వాస్తవ ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే నాలుగుసార్లు మెడికల్ బోర్డులు నిర్వహించిన నేపథ్యంలో, తీవ్ర అనారోగ్య సమస్యలతో విధులు నిర్వహించలేని కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేకంగా రీ-మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరోసారి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యపరంగా అర్హులైన వారిని నిబంధనల ప్రకారం అన్‌ఫిట్‌గా నిర్ధారించాలని కోరారు.మెడికల్ బోర్డు నిర్ణయాలు కేవలం హైదరాబాద్ నుంచి వచ్చే వైద్యుల అభిప్రాయాలకే పరిమితం కాకూడదని కొరిమి రాజ్ కుమార్ సూచించారు. కార్మికుల వాస్తవ ఆరోగ్య పరిస్థితి, వారు నిర్వహిస్తున్న విధుల స్వభావం, శారీరక సామర్థ్యం, వైద్య నివేదికలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను సమగ్రంగా పరిశీలించాలన్నారు.మెడికల్ బోర్డుల నిర్వహణలో ఏకరీతి



విధానం, పారదర్శకత, వైద్యపరమైన న్యాయం ఉండాలని స్పష్టం చేశారు.ప్రస్తుతం సుమారు 1,800 మంది కార్మికులు అన్‌ఫిట్ కోసం ఎదురుచూస్తున్నారని ఏఐటీయూసీ పేర్కొంది. వీరిలో అనేక మంది అనారోగ్య కారణాలతో సాధారణ విధులు నిర్వహించలేక, కుటుంబాలను పోషించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపింది. గతంలో అమలు చేసిన మెడికల్ బోర్డు విధానాలను పునఃపరిశీలించి, అర్హులైన ప్రతి కార్మికుడికి నిబంధనల ప్రకారం అన్‌ఫిట్ సర్టిఫికేషన్ లభించేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని కొరిమి రాజ్ కుమార్ కోరారు.

# ముష్టిబండలో రూ.1.80 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । అక్టోబర్ 7 :** దమ్మపేట మండలం ముష్టిబండ జడ్పీ పరిధిలోని నందిగామ లలితకు రూ.1.80 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును సర్పంచ్ సిద్ధిని రాధా చలపతిరావు అందజేశారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు చెక్కును అందజేసినట్లు తెలిపారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న లలితకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అండగా నిలుస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాకి కృషి చేస్తా

**– అన్నదాతలు, డ్వాక్రా మహిళల జీవనోపాధికి భరోసా కల్పిస్తాం**

**– కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్) :** కొత్తగూడెం పట్టణ రైతుబజార్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు భరోసా ఇచ్చారు. శంకుస్థాపనలు సందర్భంగా 29వ డివిజన్లో రైతుబజార్‌కు చెందిన రైతులు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేసి తమ సమస్యలను విన్నవించారు. 2021 ఏప్రిల్‌లో ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి తాత్కాలిక రైతుబజార్‌కు పంపారని, కానీ ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాక ఎండ, వానల్లో బిక్కుబిక్కుమంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పందిస్తూ.. రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న 130 మంది రైతులు, 16 మంది డ్వాక్రా సంఘాల సభ్యుల దీనస్థితి తనను కలచివేసిందన్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించేలా సంబంధిత ఉన్నతాధికారులతో స్వయంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. అవసరమైన చర్యలు తీసుకుని మార్కెట్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తానని, వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని పేర్కొన్నారు. అన్నదాతలు, పేద మహిళల జీవనోపాధికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని పేద వర్గాల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన వెల్లడించారు. ఎమ్మెల్యే వెంటి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, జిల్లా సమితి సభ్యులు గెద్దాడు నగేష్ తదితరులు వున్నారు.

# మహిళల భద్రతకు పటిష్ట వ్యవస్థ, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ పై అవగాహన కలిగి ఉండాలి

**– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్)** :
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం నాడు ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ(ఐసీసీ) మరియు ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్మెంట్ (పిఓఎస్హెచ్) చట్టంపై మహిళా పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహిళలు కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ కీలక బాధ్యతలు చేపడుతున్నారని తెలిపారు. విధి నిర్వహణలో మహిళా సిబ్బందికి ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ(ఐసీసీ) ద్వారా నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు అమల్లో ఉన్న పిఓఎస్హెచ్ చట్టం-- 2013 నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళా ఉద్యోగుల గౌరవం, భద్రత, హక్కుల పరిరక్షణకు ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.విధి నిర్వహణలో మహిళా సిబ్బందికి ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే వాటిని తన దృష్టికి కూడా తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖలో ప్రతి మహిళా ఉద్యోగి ఆత్మవిశ్వాసంతో, భద్రతతో విధులు నిర్వహించేలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళ పోలీసు సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంలో ముందుండాలని సూచించారు. ఆధునిక పోలీసింగ్‌లో కీలకంగా ఉపయోగిస్తున్న నాట్ గ్రిడ్, గాండీవ, సహాయోగ్ తదితర వెబ్ అప్లికేషన్లపై అవగాహన పెంపొందించుకుని, వాటిని విధి



నిర్వహణలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, ఆధునిక టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పోలీసింగ్‌ను మరింత ప్రజలకు చేరువ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ అధికారులు సీఐ శ్రీలక్ష్మి, సిఐ రాము, ఎస్బి ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, డిస్టిక్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇంచార్జ్ ఎస్సై శ్రీనివాస్, షీటీమ్ ఎస్సై రమాదేవి, జిల్లాలోని మహిళ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగూడెం 1వ టౌన్ సీఐగా భాధ్యతలు స్వీకరించిన సముద్రాల జితేందర్



**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్) :** కొత్తగూడెం 1వ టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా జితేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన కరుణాకర్ కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో జితేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సీఐ జితేందర్ మాట్లాడుతూ... 1వ టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నూతన సీఐ జితేందర్‌కు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# .పిఆర్టియు వైరా మండల శాఖ ఆధ్వర్యంలో రాజుకు 21 వేల రూపాయలు సహాయం

**వైరా, అక్టోబర్ 7,,భద్రాద్రి న్యూస్):** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ ఫిషరీస్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పిఆర్టియు వైరా మండల అధ్యక్ష కార్యదర్శులు వెలిశెట్టి నరసింహారావు వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు కట్ట శేఖర్ రావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు జితేందర్ రెడ్డి, పి ఆర్ టి యు మాజీ అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు, వై వి, వైరా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఫోటోగ్రాఫర్ పమ్మిరాజు విషయాన్ని తెలుసుకున్న పిఆర్టియు వైరా మండల శాఖ, మండలంలోని పిఆర్టియు ఉపాధ్యాయులందరి భాగస్వామ్యంతో 21 వేల రూపాయలు రాజుకు బుధవారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పిఆర్టియు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో పి ఆర్ టి యు రాష్ట్రంలో అగ్రగామిగా ఉన్నటువంటి విషయం అందరికీ తెలిసిందే. పిఆర్టియు సంఘం సామాజిక సమస్యల మీద కూడా ఎప్పుడు తన వంతు సహకారం అందిస్తుందని, దీనికి వైరా పిఆర్టియు కుటుంబ సభ్యులందరూ ఒక బాధ్యతగా తీసుకొని ఇలాంటి సహృదయ కార్యక్రమం చేసినందుకు వైరా మండల శాఖను ప్రత్యేకంగా అభినందించాను అని అన్నారు. యలమద్ది వెంకటేశ్వర్లు, వై వి మాట్లాడుతూ ఒంటరిగా పనిచేయటం ఏ ఒక్కరికి, ఏ పని సాధ్యం కాదని, పి ఆర్ టి యు వైరా మండల శాఖ సమిష్టి కృషిగా ఈ కార్యక్రమం చేసిందని, భవిష్యత్తులో ఇలాంటి మంచి కార్యక్రమాలు ఎలాంటివి ఉన్న సమిష్టిగా సహాయ సహకారాలు అందించాలని, పమ్మి రాజు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైరా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సహకారం పమ్మిరాజుకు అందించటం అనేది మంచి విషయమని, అందుకు పిఆర్టియు వైరా మండల శాఖను అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు ఖమ్మం జిల్లా అధ్యక్షులు



కట్టా శేఖర్ రావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు జితేందర్ రెడ్డి, ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు ఎలమద్ది వెంకటేశ్వర్లు, వై వి, వైరా మండల అధ్యక్షులు వెలిశెట్టి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, సంఘ సీనియర్ బాధ్యురాలు గాజుల భారతి, జిల్లా కార్యదర్శి కారుమంచి దయాకర్ రావు, పి. లత, తదితరులు పాల్గొన్నారు

# భాగ్యనగర్ తండాలో తొలి బోర్‌వెల్ రీఛార్జ్ పనులు పూర్తి

**– వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించడమే లక్ష్యం..**

**– పనుల నాణ్యతపై పీడీ కొండపల్లి శ్రీరామ్ సంతృప్తి**

**కారేపల్లి, అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్ రాములు ):**
భవిష్యత్‌లో భూగర్భ జలాల కొరతను నివారించేందుకు వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించే లక్ష్యంతో వీబీజీ--రామ్‌జీ ఆధ్వర్యంలో చేపడుతున్న బోర్‌వెల్ రీఛార్జ్ పనుల్లో భాగంగా సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో తొలి పనులు పూర్తయ్యాయి. పూర్తయిన బోర్‌వెల్ రీఛార్జ్ పనులను వీబీజీ--రామ్‌జీ పీడీ కొండపల్లి శ్రీరామ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేస్తూ గ్రామ సర్పంచ్ బానోత్ హీరాలాల్‌ను అభినందించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీరామ్ మాట్లాడుతూ.. బోర్‌వెల్ రీఛార్జ్ విధానం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాలను పెంపొందించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు ఇలాంటి రీఛార్జ్ పనులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రతి గ్రామంలో వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీడీలు చలపతి, శ్రీదేవి, ఎంపీడీఓ పద్మ, సర్పంచ్ బానోత్ హీరాలాల్, ఏపీఓ కోటేశ్వరరావు, ఈసీ సుధీర్, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు రాంబాబు, వసంత్, గ్రామస్తులు గుగులోత్ బాబు, పంచాయతీ




సిబ్బంది రాందాస్, హేంచంద్, నంద, లకన్, గణేష్, రమేష్, రాకేష్, రాధ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ సమస్యలపై ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు వినతి

**సర్పంచ్ టోనీ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకుల భేటీ.. పరిష్కారానికి సానుకూల హామీ**



**కారేపల్లి, అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్ రాములు ):** సింగరేణి మండలంలోని మైనార్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి గ్రామపంచాయతీ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను బుధవారం కొత్తగూడెంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని మైనార్టీ వర్గాలకు సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మైనార్టీ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. మైనార్టీ నాయకులు వివరించిన సమస్యలను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సానుకూలంగా విన్నారని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే స్పందనతో సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షాదీఖానా వైర్మన్ యాకూబ్ అలీ, మైనార్టీ నాయకులు తాజుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు హనీఫ్, అడ్డగోడ ఐలయ్య, ఆదేర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు కుటుంబానికి, సమాజానికి అమూల్యమైన సంపద

**– ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వృద్ధులకు చేరేలా చర్యలు**
**– భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం. విద్యాచందన**

**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్) :** అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో వృద్ధుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం. విద్యాచందన ముఖ్య అతిథిగా హాజరై వృద్ధులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక అదనపు కలెక్టర్ విద్యాచందన మాట్లాడుతూ... వృద్ధులు కుటుంబానికి, సమాజానికి అమూల్యమైన సంపద అని అన్నారు. తమ జీవిత అనుభవం, జ్ఞానం, విలువలతో సమాజ నిర్మాణంలో వృద్ధులు విశిష్ట పాత్ర పోషించారని పేర్కొన్నారు. వృద్ధుల పట్ల గౌరవం, ఆప్యాయత, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు.వృద్ధుల హక్కుల పరిరక్షణ, గౌరవప్రదమైన జీవనం, ఆరోగ్యం, సామాజిక మరియు ఆర్థిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి వృద్ధుడికి చేరేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వృద్ధులు తమ హక్కులు, ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.వృద్ధుల సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ఎస్జెడ్సి లు, వృద్ధుల సంఘాలు, ఎస్ఈఆర్పి సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. వృద్ధులపై నిర్లక్ష్యం, వివక్ష, వేధింపులు చోటుచేసుకోకుండా కుటుంబ సభ్యులు, సమాజం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అవసరమైన సందర్భాల్లో వృద్ధులకు చట్టపరమైన సహాయం, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత, ఇతర ప్రభుత్వ సేవలు అందేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు.కార్యక్రమంలో వృద్ధుల కోసం అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక భద్రతా కార్యక్రమాలు, వివిధ సేవలపై అవగాహన కల్పించారు.



వృద్ధుల సమస్యలను తెలుసుకొని వారికి అవసరమైన సహకారం అందించేందుకు అధికారులు, సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధుల ఎస్జెడ్సి సభ్యులను సన్మానించి వారి సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేందర్, జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా విద్యాశాఖ అధికారి శంభు ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి అనూష, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌రెడ్డి, న్యాయవాది యు. అరుణ్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ దినేష్, అదనపు దిఆర్డిఓ నీలేష్, ఎస్జెడ్సి హైదరాబాద్ ప్రతినిధి రంగారావు, పిఈ, జెడ్ఎస్ అధ్యక్షురాలు సుజాత, ఎన్జిఓ ప్రతినిధి జ్యోతి, సఖి కేంద్ర ప్రతినిధులు, డిపిఎంలు, ఏపిఎంలు, సిసిలు, వృద్ధుల ఎస్జెడ్సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ--రామ్‌జీ పనుల్లో నాణ్యతకు పెద్దపీట

**– అప్పాయిగూడెంలో అభివృద్ధి పనులపై పీడీ శ్రీరామ్ ఆకస్మిక తనిఖీ**



**కారేపల్లి, అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్ రాములు ):** గ్రామీణాభివృద్ధి పనులను ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) శ్రీరామ్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో వీబీజీ--రామ్‌జీ కార్యక్రమం కింద చేపడుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం పీడీ శ్రీరామ్ అధికారుల బృందంతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్పాయిగూడెం ఎంపీపీఎస్ పాఠశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ సోక్‌పిట్ (ఇకుడు గుంత) పనులను పరిశీలించారు. నిర్మాణ పురోగతి, పనుల్లో వినియోగిస్తున్న పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి, సాంకేతిక ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో పీడీ శ్రీరామ్ మాట్లాడి, పని ప్రదేశంలో పాటించాల్సిన భద్రతా జాగ్రత్తలను వివరించారు. ఎండల తీవ్రత పెరిగే నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూనే, పనుల విషయంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పీడీ సూచించారు. పనుల అమలులో పారదర్శకత పాటిస్తూ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ తనిఖీలో ఏపీడీలు శ్రీదేవి, చలపతిరావు, ఎంపీడీఓ పద్మ, అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, ఏపీఓ కోటేశ్వరరావు, ఈసీ సుధీర్, గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి, బీఎఫ్‌టీలు వసంత్, రాంబాబు, పార్వతి, హ్యాండ్‌పంప్ మెకానిక్ మోహన్‌రావు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కోదాడ నియోజకవర్గంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై జర్నలిస్టుల ఆధ్వర్యంలో**

# భారీ అవగాహన ర్యాలీ: ఐక్యంగా కదలాలని పిలుపు

**కోదాడ, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్):**
కోదాడ నియోజకవర్గంలో డ్రగ్స్, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ప్రజల్లో, ముఖ్యంగా యువత మరియు విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా కోదాడ నియోజకవర్గ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఒక భారీ అవగాహన ర్యాలీని నిర్వహించ తలపెట్టారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్యపరచడం, యువతను ఈ వ్యసనాలకు దూరంగా ఉంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడడమే ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. నియోజకవర్గ పరిధిలో వివిధ పత్రికలు, న్యూస్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 100 నుంచి 120 మంది మీడియా మిత్రులందరూ ఏకతాటిపైకి వచ్చి, ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని సీనియర్ జర్నలిస్టులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఐక్యతను చాటడంతో పాటు సమాజం పట్ల మీడియాకున్న బాధ్యతను నిరూపించేందుకు ఇదొక గొప్ప వేదిక అని వారు అభిప్రాయపడ్డారు. ఈ భారీ అవగాహన ర్యాలీ విజయవంతం కోసం కోదాడ ఎస్సీ, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు ఉన్నతాధికారులను లిఖితపూర్వకంగా ఆహ్వానించి, వారి పూర్తి సహకారం, సమన్వయంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నారు. అలాగే కోదాడ పట్టణంలోని అన్ని కళాశాలల విద్యార్థులు, యువతీ యువకులు, విద్యాసంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసి సమాజానికి ఒక బలమైన సందేశాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. "డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి -- యువత భవిష్యత్తును కాపాడాలి" అనే ప్రధాన నినాదంతో ఈ ర్యాలీ సాగనుంది. జర్నలిస్టులు కేవలం వార్తలను అందించడమే కాకుండా.. సమాజ హితం కోసం, ప్రజా చైతన్యం కోసం ఎల్లప్పుడూ ముందుంటారని చాటిచెప్పేందుకు నియోజకవర్గంలోని ప్రతి ఒక్క మీడియా మిత్రుడు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని మీడియా ప్రతినిధులు కోరుతున్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**– ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే: కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు**



**కారేపల్లి, అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్ రాములు) :** ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసాన్ని పునరుద్ధరించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందని కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు అన్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాలు, ప్రజలు వ్యక్తం చేస్తున్న అనుమానాలు, ఆరోపణలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాటిపై సమాధానం ఇవ్వలేని పరిస్థితి ఉంటే నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ఓటరు జాబితాల రూపకల్పన నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు, తుది ఫలితాల ప్రకటన వరకు ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి ఉండాలని తిరుమల రావు పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో సందేహాలు తలెత్తకుండా ఎన్నికల సంఘం స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు అత్యంత విలువ ఉందని, ఓటర్ల హక్కులను పరిరక్షించడం రాజ్యాంగబద్ధ సంస్థల ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. ఎన్నికల సంఘం పనితీరుపై వస్తున్న ఆరోపణలు, సందేహాలకు సంతృప్తికరమైన వివరణలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల సంఘం రాజకీయాలకు అతీతంగా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తిరుమల రావు అన్నారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ బాధ్యతలకు అనుగుణంగా పనిచేస్తూ ఓటర్ల హక్కులను కాపాడాలని ఆయన కోరారు.

# గాదెపాడులో పింఛన్ల పరిశీలన.. పోషణపై డీపీఓ ప్రత్యేక దృష్టి

**– వితంతు, వికలాంగుల పింఛన్లపై క్షేత్రస్థాయి ఎంక్వయిరీ.. అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారాన్ని పరిశీలించిన డీపీఓ వినోద్ కుమార్**





**కారేపల్లి, అక్టోబర్ 7 (భద్రాద్రి న్యూస్):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపడుతున్నామని ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్ తెలిపారు. సింగరేణి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలో వితంతు, వికలాంగుల చేయూత పింఛన్లకు సంబంధించిన దరఖాస్తులను బుధవారం ఆయన పరిశీలించారు. సింగరేణి మండల ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్‌తో కలిసి లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ఎంక్వయిరీ చేశారు. అనంతరం గాదెపాడు అంగన్వాడీ కేంద్రం-2లో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమం, గర్భిణుల శ్రీమంతం, చిన్నారుల అక్షరాభ్యాస కార్యక్రమాల్లో డీపీఓ వినోద్ కుమార్, ఎంపీఓ రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. సీడీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలతో డీపీఓ నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, దాని వినియోగం, లబ్ధి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.
**పోషకాహార పదార్థాల పరిశీలన :** అంగన్వాడీ టీచర్లు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల పోషకాహార పదార్థాలను డీపీఓ పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో విధులను బాధ్యతగా నిర్వహిస్తూ చిన్నారుల ఆరోగ్యం, పోషణ, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీఓ వినోద్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్లు, సూపర్‌వైజర్, సీడీపీఓ, ఎంపీయూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలతో ఎండిపోతున్న పైర్లు

**- కోదాడ సబ్‌స్టేషన్ ముట్టడి**
**- అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా**
**- ట్రాక్టర్లు అడ్డుపెట్టి అధికారులను నిలదీసిన రైతులు**
**- ఎకరాకు 30 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్**



**కోదాడ, అక్టోబర్ 7(భద్రాద్రి న్యూస్):** విద్యుత్ కోతల వల్ల చేతికొచ్చిన వరి పైర్లు ఎండిపోతున్నాయని ఆగ్రహిస్తూ కోదాడ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ నాయకత్వంలో రైతులు సబ్‌స్టేషన్ ముందు ట్రాక్టర్లను అడ్డుగా పెట్టి ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ మాట్లాడుతూ ఎడాపెడా విద్యుత్ కోతలు విధించడం వల్ల పొలాలకు నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల కారణంగా ఎండిపోయిన పంటలకు ఎకరాకు 30,000 చొప్పున పరిహారం చెల్లించాలని, అలాగే పంటలను కాపాడేందుకు వెంటనే 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతులు కమతం వెంకటరావు, కుటుంబరావు, సైదయ్య, సామినేని సుబ్బారావు, సతీష్, నగేష్,కనగాల పూర్ణ, కొండయ్య, నాగుల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ సంకల్ప సేవా జ్యోతి యాత్ర

**- 2047లో వికసిత్ భారత్ లక్ష్యమే ఈ సంకల్ప సభ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**
**- ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎస్ సైదిరెడ్డి**

**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్) :** వికసిద్భారత్ సంకల్ప సేవ జ్యోతి యాత్ర కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ-సేవా జ్యోతి యాత్రను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎస్. సైదిరెడ్డి, జిల్లా సంస్థ గత ఇంచార్జ్ డాక్టర్ విజయ చంద్రారెడ్డి పాల్గొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో అడుగుపెట్టి ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రిగా ఈ దేశానికి సేవలందించడం 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ లో ఏర్పాటుచేసిన డిజిటల్ స్క్రీన్ లో వికసిత్ భారత్ సంకల్ప సభలో జాతీయ బిజెపి అధ్యక్షులు నితిన్ నబిన్, భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని జిల్లా వ్యాప్తంగా వచ్చిన భారతీయ జనతా పార్టీ నాయకులు, పట్టణంలో ప్రముఖులు, వివిధ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు విన్నారు. ఈ ప్రసంగంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలను ఉద్దేశించి 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రతి పౌరుడు సంకల్ప దీక్షను తీసుకోవాలని అన్నారు. మా ప్రభుత్వ విధానం కుల మత రాజకీయాలు చేయడం కాదని దేశంలోని ప్రతి పౌరుడికి ఈ దేశ ఫలాలు అందాలన్నదే తమ ప్రభుత్వ విధానం అని అన్నారు. అదేవిధంగా 2047 వికసిత్ భారత్ వి విల్ డూ ఇట్, మేకిన్ ఇండియా వి విల్ డూ ఇట్. ఆత్మ నిర్భర్‌భారత్ వి విల్ డూ ఇట్. ఒలంపిక్ డ్రీమ్ వి విల్ డూ ఇట్. అంటూ ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అందరూ 2047, వికసిత్ భారత్ లక్ష్యంగా దీక్ష చేపట్టాలని అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరం పనిచేయాలని అన్నారు. తరువాత కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి సేవా జ్యోతి యాత్రను జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీదేవి పల్లి వరకు కొనసాగించారు. ఈ యాత్రలో బిజెపి ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు జీవీకే మనోహర్ , కె.వి రంగా కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోడియం బాలరాజు, ఇతర రాష్ట్ర జిల్లా నాయకులు కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమి విజయం తథ్యం

**- 09-10-2026 శుక్రవారం ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగనున్నాయి.**
**- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, టీఎంయూ ఐక్య కూటమి**



**కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 07 (భద్రాద్రి న్యూస్) :**
ఈ సందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, టీఎంయూ ఐక్య కూటమి ఆధ్వర్యంలో బస్టాండ్ ఆఫీస్ నందు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెస్ మీట్ లో ఎస్డబ్యుఎఫ్ రీజియన్ సహాయ కార్యదర్శి యాస నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి భూక్య రమేష్, ఎస్డబ్లుఎఫ్ సీనియర్ నాయకులు మల్సూర్, చారి, ప్రస్తుత డిపో అధ్యక్ష కార్యదర్శులు బత్తుల నాగేశ్వరరావు, ఇసనపల్లి శామ్యూల్ కుమార్, రీజియన్ సహాయ కార్యదర్శి పర్వీన్ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఐక్య కూటమిని గెలిపిస్తే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేయిస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం, పెండింగ్ లో ఉన్న పే స్కేల్, ఆర్టీసీలో యూనియన్లకు అనుమతి అంశాలను అమలు చేయిస్తామన్నారు. - కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక 2026 ఏప్రిల్ 22,23,24 తేదీల్లో అన్ని యూనియన్లు సంపూర్ణ ఐక్యతతో సమ్మె చేయడంతో ప్రభుత్వం అన్ని యూనియన్లతో చర్చలు జరిపి 2021 సంవత్సర 11% వేతన సవరణ చేసిందన్నారు. - గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రక్రియ కోసం కృషి చేయడంతో ఎన్నికలు జరుగుతున్నాయని, గెలిచిన గుర్తింపు సంఘ ప్రతినిధులతోనే విలీన కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. - టీఎంయూ అశ్వద్ధామ రెడ్డి వర్గంతో టిడబ్లుయు వారు జత కట్టి, ఎస్డబ్లుఎఫ్ తో ఐక్య కూటమిగా ఏర్పడ్డారని, ఈ ఐక్య కూటమికి ఐఎన్టియుసి కూడా మద్దతు ఇస్తోందన్నారు. - ఖమ్మం, నల్గొండ రీజియన్లలో ఎస్డబ్లుఎఫ్ నక్షత్రం గుర్తుపై, మిగిలిన రీజియన్లలో, రాష్ట్ర గుర్తింపులో టిడబ్లుయు బాణం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. - గతంలో ఖమ్మం రీజియన్ లో ఎస్డబ్లుఎఫ్ గుర్తింపులో ఉండగా కొత్తగూడెంలో డిస్పెన్సరీ ఏర్పాటు, గ్యారేజీలలో ఫెడెస్టల్ ఫ్యాన్ల ఏర్పాటు, సింగిల్ క్రూ లేకుండా చేయడం వంటి ఘనత నాజెఖీ కు ఉందని తెలిపారు. ఐక్య కూటమి గెలిస్తే భవిష్యత్తులో ఆర్టీసీ పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని, ప్రత్యర్థులు ఎన్ని అవాకులు, చవాకులు పేలినా 9వ తేదీన జరిగే ఎన్నికల్లో కార్మికులు తగిన బుద్ధి చెప్పబోతున్నారని అన్నారు.

# అర్హులైన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**– బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు**



**నేలకొండపల్లి (భద్రాద్రి న్యూస్) అక్టోబర్ 7:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత కలిగిన యువత తప్పనిసరిగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని నేలకొండపల్లి బీఎస్పీ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు అన్నారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాకుండా, ప్రజాప్రతినిధుల ఎంపికలో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ముఖ్యమైన అవకాశం అని తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లుగా నమోదు కావడానికి సంబంధిత నిబంధనల ప్రకారం, అర్హత కలిగిన వ్యక్తి సాధారణంగా ఆ నియోజకవర్గంలో నివసిస్తూ, అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు భారతదేశంలోని విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడై ఉండాలని, పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి ఆన్ లైన్ ద్వారా గాని, ఫారం18 ఉపయోగించి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారు తమ పేర్లు ఇప్పటికే నమోదయ్యాయా లేదా పరిశీలించుకోవడంతో పాటు, అవసరమైతే ఎన్నికల అధికారుల సూచనల మేరకు దరఖాస్తు చేసుకోవాలని బొడ్డు బాబురావు కోరారు. ఎన్నికల సంఘం ఓటర్ల సేవల పోర్టల్ ద్వారా ఓటరు సంబంధిత సేవలను అందిస్తోంది.ప్రత్యేకంగా మొదటిసారి పట్టభద్రులైన యువత ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకుని, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.